# మన చౌరాస్తా

తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 191 | శనివారం, 13 జూన్ 2026 | పేజీలు : 4


## విద్యార్థులకు డీసీపీ లెసన్

3

జనగామ పట్టణంలోని శ్రీఉమామహేశ్వర స్వామి దేవాలయంలో శివాజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, పెన్నుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జనగామ డీసీపీ రాజమహేంద్ర నాయక్ ముఖ్య అతిథిగా హాజరై విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీసీపీ చాక్ పీస్ పట్టి ఉపాధ్యాయుడిలా బోర్డుపై రోడ్ సేఫ్టీ అంశాలను వివరిస్తూ విద్యార్థులకు అవగాహన కల్పించారు. హెల్మెట్ వినియోగం, సీట్‌బెల్ట్, ట్రాఫిక్ నిబంధనలు, డ్రైవింగ్ లైసెన్స్, వాహన బీమా ప్రాముఖ్యతపై వివరించారు. - మన చౌరాస్తా, జనగామ









# సమానంగా పనిచేస్తున్నప్పటికీ వివక్షెందుకు?

- కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులపై నిర్లక్ష్యం వీడాలి
- ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనాలివ్వాలి
- మంత్రి జూపల్లికి టూరిజం కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ వినతి



**హైదరాబాద్, మన చౌరాస్తా:** తెలంగాణ రాష్ట్ర టూరిజం కార్పొరేషన్‌లో గత 23 ఏళ్లుగా కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ టూరిజం కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రతినిధులు రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును సచివాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు శాశ్వత ఉద్యోగులతో సమానంగా విధులు నిర్వహిస్తున్నప్పటికీ సరైన వేతనాలు, ఉద్యోగ భద్రత, సంక్షేమ సౌకర్యాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత 23 ఏళ్లుగా సేవలందిస్తున్న ఉద్యోగులను క్రమబద్ధీకరించి శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. ఇటీవల కాంట్రాక్ట్ ఉద్యోగుల వేతనాలు పెంచిన నేపథ్యంలో, అదే తరహాలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, టూరిజం ప్లాజాల్లో పనిచేస్తున్న సిబ్బందికి కూడా వేతనాలు పెంచాలని విజ్ఞప్తి చేశారు. అలాగే పదవీ విరమణ వయోపరిమితిని ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా 61 సంవత్సరాలకు పెంచాలని డిమాండ్ చేశారు. రిస్క్ అలవెన్స్, బస్సు పాస్, గ్రాట్యుటీ వంటి గతంలో అమలులో ఉన్న సంక్షేమ సౌకర్యాలను పునరుద్ధరించాలని కోరారు. ఉద్యోగుల సంక్షేమం పట్ల ప్రభుత్వం మానవతా దృక్పథంతో స్పందించాలని విజ్ఞప్తి చేశారు. నాగార్జునసాగర్, వికారాబాద్, రామప్ప, లక్నవరం, తాడ్వాయి, గట్టమ్మ ప్రాంతాల్లోని టూరిజం హోటళ్లు, రెస్టారెంట్లను ప్రైవేటు సంస్థలకు అప్పగించడం వల్ల సేవల నాణ్యత తగ్గుతోందని పేర్కొన్నారు. వాటిని తిరిగి టూరిజం కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తే సంస్థ ఆదాయం పెరగడంతో పాటు పర్యాటకులకు మెరుగైన సేవలు, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించవచ్చని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో యూనియన్ గౌరవ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి సబ్బు రాజమౌళి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మణికంఠ రెడ్డి, బాలరాజు తదితరులు పాల్గొన్నారు. ఉద్యోగుల సమస్యలను సానుకూలంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చినట్లు యూనియన్ ప్రతినిధులు తెలిపారు.

# గాంధీనగర్ గ్రామంలో 20న పోటీలు

- ఉమ్మడి కరీంనగర్, వరంగల్ జిల్లా స్థాయి కాంపొటీషన్స్



**కరీంనగర్, మన చౌరాస్తా:** ఉమ్మడి కరీంనగర్, ఉమ్మడి వరంగల్ జిల్లాల గ్రామీణ స్థాయి కబడ్డీ క్రీడోత్సవాలను ఈ నెల 20, 21 తేదీలలో కరీంనగర్ జిల్లాలోని గాంధీనగర్ గ్రామంలో నిర్వహించనున్నట్లు నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు. గ్రామ సర్పంచ్ కేతిరి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో, ఉమెన్స్ వెల్ఫేర్ సొసైటీ చైర్మన్ కె. సుహాసిని సహకారంతో ఈ పోటీలు జరగనున్నాయి. ఈ సందర్భంగా క్రీడోత్సవాల కరపత్రాలను సర్పంచ్ ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ, యువతలో పెరుగుతున్న మానసిక ఒత్తిడి, వ్యసనాలు, ఆన్‌లైన్ గేమింగ్ ప్రభావం ఆందోళనకరమని అన్నారు. అలాగే అతివేగంతో వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు పెరిగి కుటుంబాలు విషాదంలో మునిగిపోతున్నాయని పేర్కొన్నారు. యువతలో క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించి, మనోధైర్యం, క్రమశిక్షణ, క్రీడాస్ఫూర్తి, సామాజిక బాధ్యత వంటి విలువలను పెంచాలనే లక్ష్యంతో ఈ కబడ్డీ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి కరీంనగర్, వరంగల్ జిల్లాల నుంచి అధిక సంఖ్యలో క్రీడాకారులు పాల్గొని పోటీలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. క్రీడోత్సవాల నిర్వహణకు కృషి చేస్తున్న నిర్వాహక కమిటీ సభ్యులను ఆయన అభినందించారు. గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీయడంతో పాటు యువతను సానుకూల దిశగా నడిపించేందుకు ఈ పోటీలు వేదికగా నిలుస్తాయని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉమెన్స్ వెల్ఫేర్ సొసైటీ చైర్మన్ కె. సుహాసిని, నిర్వాహక కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



### తాగి నడిపినందుకు

# జైలు శిక్ష

- ముగ్గురికి జైలు శిక్ష విధించిన జనగామ కోర్టు
- 12 మందికి రూ.10 వేల చొప్పున ఫైన్

**జనగామ, మన చౌరాస్తా:** డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులపై జనగామ ఏడీఎం కోర్టు కఠినంగా స్పందించింది. శుక్రవారం విచారణ నిర్వహించిన న్యాయమూర్తి సందీప పలు కేసుల్లో శిక్షలు, జరిమానాలు విధించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో నిందితులైన దేవరుప్పుల గ్రామానికి చెందిన బోయిని రాజు, జనగామకు చెందిన ఎండి అక్బర్ బాషా, మాలోతు బాలుకు కోర్టు రెండు రోజుల జైలు శిక్ష విధించింది. అలాగే మరో 12 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో నిందితులకు ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున మొత్తం రూ.1.20 లక్షల జరిమానా విధించినట్లు అధికారులు తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.

# మహిళా సాధికారతపై చిత్తశుద్ధి లేని బీజేపీ

## టీపీసీసీ మెంబర్ లక్ష్మీనారాయణనాయక్



**జనగామ, మన చౌరాస్తా:** మహిళా సాధికారత పేరుతో ప్రచారం చేసుకుంటున్న కేంద్ర ప్రభుత్వం ఆచరణలో మాత్రం భిన్నంగా వ్యవహరిస్తోందని టీపీసీసీ సభ్యులు డాక్టర్ లక్ష్మీ నారాయణ నాయక్ విమర్శించారు. కాంగ్రెస్ సీనియర్ లీడర్ మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణ దీనికి ఉదాహరణ అని పేర్కొన్నారు. శుక్రవారం ఆయన జనగామలో మీడియాతో మాట్లాడారు. మహిళలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పిస్తామని చెప్పే బీజేపీ ప్రభుత్వం, మహిళా నాయకురాలికి అవకాశం రాకుండా చేయడం విడ్డూరమన్నారు. మహిళా సాధికారతపై కేంద్ర ప్రభుత్వం చెప్పే మాటలకు, తీసుకుంటున్న చర్యలకు సంబంధం లేదని విమర్శించారు. మీనాక్షి నటరాజన్‌కు రాజ్యసభ సభ్యురాలిగా అవకాశం లభించే పరిస్థితులు ఉన్నప్పటికీ ఆమె నామినేషన్ తిరస్కరణ పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. రాజ్యాంగంపై నిజమైన గౌరవం ఉంటే రాజ్యసభ ఎన్నికల ప్రక్రియలో పూర్తి పారదర్శకత పాటించాలని, పోటీ చేసిన 24 మంది అభ్యర్థుల అఫిడవిట్లను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆధ్వర్యంలో పరిశీలించే ధైర్యం ఉందా అని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వ చర్యలను సమర్థించలేక కొందరు బీజేపీ నాయకులు కాంగ్రెస్‌పై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. మహిళల హక్కులు, గౌరవం, రాజకీయ ప్రాతినిధ్యం విషయంలో కేంద్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదని విమర్శించారు. గత 12 సంవత్సరాలుగా కేంద్ర ప్రభుత్వం ప్రచారానికే పరిమితమైందని, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల, నిరుద్యోగం, రైతుల సమస్యలు, ఆర్థిక భారాలపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రచారం కంటే ప్రజా సమస్యల పరిష్కారంపైనే దృష్టి సారించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

# ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్‌గా శ్రీనివాస్

**జనగామ, మన చౌరాస్తా:** కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలోని జనగామ జిల్లా జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) జిల్లా ప్రోగ్రాం అధికారిగా డాక్టర్ వస్కుల శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ మేరకు కాకతీయ విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ నియామక ఉత్తర్వులు జారీ చేసి పత్రాన్ని అందజేశారు. ప్రస్తుతం డాక్టర్ వస్కుల శ్రీనివాస్ జనగామ ధర్మకంచ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కామర్స్ జూనియర్ లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. అలాగే తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులుగా, కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారిగా కూడా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆయన సేవలను గుర్తించిన విశ్వవిద్యాలయం జిల్లా ప్రోగ్రాం అధికారిగా నూతన బాధ్యతలు అప్పగించింది. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. జిల్లా పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో ఎన్ఎస్ఎస్ కార్యక్రమాల సమర్థ నిర్వహణ, ప్రత్యేక శిబిరాల పర్యవేక్షణ, సామాజిక సేవా కార్యక్రమాల విస్తరణకు అవకాశం కల్పించినందుకు ప్రొఫెసర్ ఈసం నారాయణకు కృతజ్ఞతలు తెలిపారు. శ్రీనివాస్ నియామకంపై వివిధ కళాశాలల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు, తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ నాయకులు, కళాశాల ప్రిన్సిపాల్ నాముని పావని కుమారి, ఎన్ఎస్ఎస్ యూనిట్-2 ప్రోగ్రాం ఆఫీసర్ మరిపల్ల రవిప్రసాద్, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు.






# 'కోట'లో కళా వైభవం

■ **వెయ్యి మంది కళాకారులతో సంగీత, నృత్య ప్రదర్శనలు**

**హనుమకొండ, మన చౌరాస్తా:** కాకతీయుల కళా, సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబించేలా అంజలి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో ఆదివారం (జూన్ 14) సాయంత్రం 3 గంటలకు వరంగల్ కోటలోని ఖుష్ మహల్ సమీప ప్రాంగణంలో "కాకతీయ మహా సంగీత-నృత్య కళా వైభవం" కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ భాషా-సాంస్కృతిక శాఖ, పర్యాటక శాఖ సహకారం అందిస్తున్నట్లు వెల్లడించారు. హన్మకొండ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో నిర్వాహకులు మాట్లాడుతూ, తెలంగాణలో తొలిసారిగా భారీ స్థాయిలో శాస్త్రీయ నృత్య బృంద ప్రదర్శన చేపడుతున్నామని తెలిపారు. వందలాది నృత్యకారులు కాకతీయుల వైభవాన్ని ప్రతిబింబించే గీతానికి సామూహికంగా నృత్య ప్రదర్శన ఇవ్వనున్నారని చెప్పారు. ఈ ప్రదర్శన ద్వారా కాకతీయ బుక్ ఆఫ్ రికార్డులో స్థానం సంపాదించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా సామూహిక నాదార్చన కార్యక్రమంలో గాయకులు భక్త రామదాసు కీర్తనలను ఆలపించనున్నారు. అంతరించిపోతున్న కళలు, సంప్రదాయాలను భావితరాలకు చేరవేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి కొండా సురేఖ, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్ రెడ్డి, సినీ నటుడు సుమన్, సంగీత దర్శకుడు ఎం.ఎల్. రాజా తదితరులు హాజరుకానున్నారు. భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. మీడియా సమావేశంలో అంజలి మీడియా గ్రూప్ ప్రతినిధులు, సలహా మండలి సభ్యులు, సాంస్కృతిక రంగ ప్రతినిధులు పాల్గొన్నారు.

# చాక్పీస్ పట్టి.. పాఠాలు చెప్పిన డీసీపీ

**రోడ్డు సేఫ్టీ లెస్సన్లు చెప్పిన డీసీపీ**




**జనగామ, మన చౌరాస్తా :** జనగామ పట్టణంలోని శ్రీఉమామహేశ్వర స్వామి దేవాలయంలో శివాజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, పెన్నుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జనగామ డీసీపీ రాజమహేంద్ర నాయక్ ముఖ్య అతిథిగా హాజరై విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీసీపీ చాక్‌పీస్ పట్టి ఉపాధ్యాయుడిలా బోర్డుపై రోడ్ సేఫ్టీ అంశాలను వివరిస్తూ విద్యార్థులకు అవగాహన కల్పించారు. హెల్మెట్ వినియోగం, సీట్ బెల్ట్, ట్రాఫిక్ నిబంధనలు, డ్రైవింగ్ లైసెన్స్, వాహన బీమా ప్రాముఖ్యతపై వివరించారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, బైక్పై ప్రయాణించే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించేలా తల్లిదండ్రులకు ఇంట్లో గుర్తు చేయాలని సూచించారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, చిన్నారులు కూడా కుటుంబ సభ్యుల్లో అవగాహన పెంచే పాత్ర పోషించాలని అన్నారు. ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేసి విద్యలో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ ప్రధాన అర్చకులు సాంబమూర్తి శర్మ, శివాజీ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.





# వెంచర్ అనుమతికి లంచం డిమాండ్

■ **ఏసీబీకి చిక్కిన నర్సింహులపేట ఎంపీడీవో, ఎంపీఓ**

**నర్సింహులపేట, మన చౌరాస్తా:** వెంచర్ అనుమతి మంజూరు చేసేందుకు లంచం డిమాండ్ చేశారనే ఆరోపణలపై నర్సింహులపేట మండల పరిషత్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించి ఎంపీడీవో రాధిక, మండల పరిషత్ అధికారి (ఎంపీఓ) కిన్నెరా యాకయ్యలను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ వ్యవహారంలో ఎంపీడీవో కుమారుడు నాగరాజును కూడా అధికారులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఏసీబీ వర్గాల సమాచారం ప్రకారం, మండల పరిధిలోని పడమటిగూడెం గ్రామంలో ఓ వెంచర్ ఏర్పాటుకు అవసరమైన అనుమతుల కోసం బాధితుడు మండల పరిషత్ కార్యాలయాన్ని ఆశ్రయించాడు. అనుమతి మంజూరు కోసం సంబంధిత అధికారులు రూ. లక్ష డిమాండ్ చేశారు. తొలి విడతగా రూ.45 వేలు తీసుకునేందుకు అంగీకరించారు. ఏసీబీ అధికారులు ముందస్తు ప్రణాళికతో కార్యాలయంలో తనిఖీలు నిర్వహించారు. బాధితుడి నుంచి రూ.45 వేల నగదు స్వీకరిస్తున్న సమయంలో అధికారులు దాడి చేసి సంబంధిత అధికారులను పట్టుకున్నారు. విచారణలో ఎంపీడీవో కుమారుడు నాగరాజు పాత్రపై కూడా అధికారులు ఆరా తీస్తున్నట్లు తెలిసింది. ఆయన వద్ద మీడియా అక్రిడిటేషన్ కార్డు ఉన్న అంశాన్ని కూడా పరిశీలిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఏసీబీ అధికారులు కార్యాలయ రికార్డులను పరిశీలిస్తున్నారు. నిందితులను ప్రత్యేక కోర్టులో హాజరుపరచనున్నట్లు సమాచారం.




# టీఆర్పీ యూత్ అధ్యక్షుడిగా పిట్టల సురేష్

**జనగామ, మన చౌరాస్తా :** తెలంగాణ రాష్ట్రంలో సామాజిక న్యాయం, బహుజన రాజ్యాధికార సాధనే లక్ష్యంగా పనిచేస్తున్న తెలంగాణ రాజ్యాధికార పార్టీ, జనగామ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడిగా పిట్టల సురేష్ ని నియమిస్తూ అధిష్టానం ఉత్తర్వులు జారీ చేసింది.గత కొన్నేళ్లుగా సామాజిక, రాజకీయ ఉద్యమాలలో చురుకుగా పాల్గొంటూ, యువత ఎదుర్కొంటున్న నిరుద్యోగ సమస్యలు, విద్య, సామాజిక అసమానతలపై నిరంతరం గళమెత్తుతున్న పిట్టల సురేష్ పోరాట పటిమను పార్టీ గుర్తించింది. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఆయన చేసిన పోరాటాలు, జైలు జీవితం ఆయన నిబద్ధతకు నిదర్శనమని పార్టీ నాయకులు పేర్కొన్నారు.సందర్భంగా పిట్టల సురేష్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి ఈ కీలక బాధ్యతలు అప్పగించిన పార్టీ రాష్ట్ర అధ్యక్షులు తీన్మార్ మల్లన్న కి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మదం రజినీ కుమార్ కి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మరియు ఉమ్మడి వరంగల్ జిల్లా ఇంచార్జి అశోక్ ముదిరాజ్ కి, రాష్ట్ర యూత్ ప్రధాన కార్యదర్శి పోలు రాజు కి మరియు జనగామ జిల్లా అధ్యక్షులు కట్ల సదానందం కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.రాబోయే రోజుల్లో పార్టీ సిద్ధాంతాలను గ్రామగ్రామాన ప్రచారం చేస్తూ, యువతను సంఘటితం చేసి, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల రాజ్యాధికారం కోసం అంకిత భావంతో పనిచేస్తానని ఆయన స్పష్టం చేశారు. సురేష్ నియామకం పట్ల జనగామ జిల్లా పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ, ఆయన నాయకత్వంలో జిల్లాలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

మన చౌరాస్తా
తెలుగు దినపత్రిక



# నయా కలెక్షన్స్ కింగ్!

## బాక్సాఫీస్‌కు అసలైన ఛాంపియన్ 'పెద్ది'

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు సనా కాంబినేషన్ లో వచ్చిన లేటెస్ట్ సినిమా 'పెద్ది'. విలేజ్ స్పోర్ట్స్ డ్రామాగా తెరకెక్కిన ఈ మూవీ ఇప్పుడు బాక్సాఫీస్ దగ్గర ఛాంపియన్‌గా నిలిచింది. జూన్ 04న ప్రేక్షకుల ముందుకు వచ్చిన పెద్ది సినిమా మొదటి రోజు నుంచే భారీ వసూళ్లు సాధిస్తోంది. విడుదలైన అన్ని చోట్లా రికార్డు లెవల్ కలెక్షన్లు రాబడుతోంది. పెద్ది మూవీ సక్సెస్ ఫుల్‌గా మొదటి వారం రన్ పూర్తి చేసుకుంది. ఈ మేరకు రామ్ చరణ్ సినిమా ఏడు రోజుల కలెక్షన్ల వివరాలను చిత్ర బృందం ప్రకటించింది.ఇప్పటివరకు పెద్ది, ప్రపంచవ్యాపం రూ.345 కోటకు పైగా గ్రాస్ వసూలు చేసినట్లు మేకర్స్ అనౌన్స్ చేశారు. ఈ రోజుతో 350 కోట్లు దాటే అవకాశముందని చెబుతున్నారు. అంతేకాదు 'బాక్సాఫీస్ రియల్ ఛాంపియన్ 'పెద్ది' అంటూ సోషల్ మీడియా వేదికగా మేకర్స్ కొత్త పోస్టర్ కూడా వదిలారు. ఇక ఓవర్సీస్ లోనూ పెద్ది సినిమాకు రికార్డు కలెక్షన్లు వస్తున్నాయి. నార్త్ అమెరికాలో ఇప్పటికే 3 మిలియన్ల డాలర్క్ మార్క్ ను పెద్ది అధిగమించింది.ఈ వారంలోనూ థియేటర్లలో పెద్ద సినిమాలేవీ రిలీజ్ కావడం లేదు. కాబట్టి మరికొన్ని రోజులు పెద్ది జోరు కొనసాగవచ్చునని ట్రేడ్ నిపుణులు అంచనా వేస్తున్నారు. లాంగ్ రన్ లో మరిన్ని కలెక్షన్లు వచ్చే అవకాశముందని అభిప్రాయపడుతున్నారు.




Printed and Published by UPPALANCHI POORNIMA on behalf of UPPALANCHI POORNIMA, Printed at Hamara Warangal Printers and Graphics H.no.25-8-182, Balaji Nagar, Kazipet, Warangal, 506003., Published at H.No.4-8-65, Dharmakancha, Jangaon, Jangaon District. Telangana, 506167, Editor : UPPALANCHI NARENDER. Ph : 8555800812, RNI : TGTEL/25/A4350